క్లుప్తంగా

గ్రామాలను అభివృద్ధి చేస్తున్న జగన్



మొండెపులంకలో సచివాలయ భవన ప్రారంభోత్సవ ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

పి.గన్నవరం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గ్రామాలు అన్ని విధాలా అభివృద్ధి చెందుతున్నాయని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మండలంలోని మొండెపులంకలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, రూ.21.8 లక్షలతో నిర్మించిన ఆర్‌బీకే సెంటర్ భవనాలను చిట్టిబాబు ప్రారంభించారు. సర్పంచ్ గుడాల రామారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో చిట్టిబాబు మాట్లాడుతూ సీఎం జగన్ ప్రభుత్వ పాలనను ప్రజలకు మరింత చేరువ చేశారన్నారు. ఎమ్మెల్యే చిట్టిబాబును సర్పంచ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, నియోజకవర్గ బూత్ కమిటీల కన్వీనర్ కొండేటి వెంకటేశ్వరరావు, సర్పంచ్ కొంబత్తుల ఏసుబాబు, పార్టీ నాయకులు మానుకొండ నాగేంద్రరావు, కొల్లాటి వెంకట్రావు, కేతా శ్రీను, గిడుగు రామకృష్ణ, తోలేటి నర్సింహరావు, పీవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో వైద్య సేవలు



బి.దొడ్డవరం సురక్ష శిబిరంలో కంటి పరీక్షలు చేస్తున్న ఖజరాని

మామిడికుదురు: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమం బి.దొడ్డవరంలో శనివారం జరిగింది. నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.స్వర్ణలత, ఆప్తాలమిక్ అసిస్టెంట్ ముజఫర్ హుస్సేన్ ఖజరానీ పలువురికి ఉచితంగా పరీక్షలు చేసి మందులు అందించారు. సురక్ష శిబిరం ద్వారా సుమారు 200 మందికి ఉచితంగా పరీక్షలు చేసి మందులు అందజేశారు. సర్పంచ్ చెల్లుబోయిన రామశివసుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ వాసంశెట్టి వెంకటరమణ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష ఎంతో మంది పేదలకు ఉపయోగపడుతుందన్నారు. ఈ శిబిరాల ద్వారా పేదలకు నాణ్యమైన వైద్యం అందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు కేదారిశెట్టి మల్లి, పార్టీ నేతలు వాసంశెట్టి శ్రీరామ్మూర్తి, బద్దే రామకృష్ణ, స్థానికులు పాల్గొన్నారు.

స్వయంకృషికి పట్టం పద్మవిభూషణ్



అంబాజీపేటలో చిరంజీవి చిత్రపటానికి క్షీరాభిషేకం

అంబాజీపేట: స్వయం కృషితో అంచెలంచెలుగా ఎదిగిన చిరంజీవికి పద్మ విభూషణ్ పురస్కారం ప్రకటించడం ఎంతో ఆనందంగా ఉందని ఆయన అభిమానులు పేర్కొన్నారు. అంబాజీపేట నాలుగు రోడ్ల కూడలిలో శనివారం చిరంజీవికి పద్మ విభూషణ్ ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ కేక్ కట్ చేశారు. చిరంజీవి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, కాపునాడు రాష్ట్ర అధికార ప్రతినిధి పత్తి దత్తుడు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, దొమ్మేటి సాయికృష్ణ, దొమ్మేటి సత్యమోహన్, గణపతి వీరరాఘవులు, అరిగెల బలరామమూర్తి పాల్గొన్నారు.

కూరగాయల విరాళం



నిత్యాన్నదాన ట్రస్టుకు కాయగూరల విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది ఆలయంలో నిత్యాన్నదాన ట్రస్టుకు శనివారం రాజోలుకు చెందిన దాత బేతినీడి సూరిబాబు రూ.30 వేల విలువైన కాయగూరలను అందజేశారు. ఈ మేరకు మినీ ట్రక్‌లో వీటిని తీసుకువచ్చి ఆలయ సూపరింటెండెంట్ పి.విజయ సారథికి అందజేశారు. స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని దాత సూరిబాబుకు సారథి ఇచ్చారు.

నేడు బొమ్మూరులో మార్కెటింగ్ ఎంప్లాయీస్ సర్వసభ్య సమావేశం

పి.గన్నవరం: తూర్పుగోదావరి జిల్లా బొమ్మూరు జీపీఆర్ గార్డెన్స్‌లో ఈనెల 28వ తేదీ ఉదయం 10 గంటలకు 'ది గోదావరి మార్కెటింగ్ సేల్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్' సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ కార్యదర్శి పొట్టుపోతు శ్రీను తెలిపారు. ఈ సర్వసభ్య సమావేశానికి ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలకు చెందిన ఎలక్ట్రానిక్స్, ఫర్నిచర్ తదితర మార్కెటింగ్ కంపెనీల ఉద్యోగులంతా హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

జగనన్న తోడుగా.. ఆసరా ఉండగా..

- వైఎస్సార్ ఆసరాతో మహిళలకు ఆర్థిక భరోసా
- మూడు సెగ్మెంట్లలో 15,749 మందికి మేలు
- బ్యాంకు ఖాతాల్లో రూ.131.51 కోట్లు జమ

మామిడికుదురు: వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు ఆర్థిక భరోసా కల్పించి వారికి అండగా నిలిచారు. ప్రభుత్వం అందించిన ఆసరా సాయాన్ని మహిళలు పెట్టుబడిగా పెట్టి, తమ జీవనోపాధిని ఎంతో మెరుగు పర్చుకుని ఆర్థిక స్వావలంబన సాగిస్తున్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు 2019 ఏప్రిల్ 11 నాటికి ఉన్న డ్వాక్రా రుణ మొత్తాన్ని నాలుగు విడతలుగా మాఫీ చేసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళల మన్ననలు అందుకున్నారు.

అనంతపురం జిల్లా ఉరవకొండ బహిరంగ సభ నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం నాలుగో విడత ఆసరా నిధులను నేరుగా డ్వాక్రా మహిళల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. పి.గన్నవరం, కొత్తపేట, రాజోలు నియోజవర్గాల పరిధిలో వైఎస్సార్ ఆసరా ద్వారా 15,749 డ్వాక్రా మహిళలు నేరుగా ప్రయోజనం పొందుతున్నారు. వారి బ్యాంకు ఖాతాలకు రూ.131.57 కోట్లు జమ య్యాయి. పి.గన్నవరం నియోజకవర్గంలో 5,469 మందికి రూ.42.64 కోట్లు, కొత్తపేటలో 6,333 మందికి రూ.55.07 కోట్లు, రాజోలులో 3,947 మందికి రూ.33.80 కోట్ల మేర ఆర్థిక ప్రయోజనం చేకూరింది.





మూడు విడతల్లో ఇలా..

నియోజకవర్గం	సంవత్సరం	చేకూరిన లబ్ధి (రూ.కోట్లలో)
పి.గన్నవరం	2020–21	41.75
	2021–22	43.57
	2022–23	42.57
మొత్తం		127.89
కొత్తపేట	2020–21	55.74
	2021–22	55.77
	2022–23	54.77
మొత్తం		164.53
రాజోలు	2020–21	33.48
	2021–22	34.17
	2022–23	33.77
మొత్తం		101.42

రూ.80 వేలు మాఫీ అయ్యింది



మాది జయదుర్గా డ్వాక్రా గ్రూపు. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా మా సంఘంలో ఒక్కొక్క సభ్యురాలికి నాలుగు విడతల్లో రూ.80,612 డ్వాక్రా రుణం మాఫీ అయ్యింది. నాలుగో విడతలో రూ.20,153 బ్యాంకు ఖాతాలో జమ చేశారు. గతంలో ఎప్పుడూ రుణ మాఫీ జరిగిన సందర్భం లేదు. సీఎం జగన్ ఇచ్చిన హామీని తుచ తప్పకుండా అమలు చేసి, మహిళలకు ఎంతో అండగా నిలిచారు. దీంతో పాటు ఎన్నో సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోంది.

– బొరుసు శివాలక్ష్మి, డ్వాక్రా సభ్యురాలు, పెదపట్నంలంక

జగన్ అండగా నిలిచారు



డ్వాక్రా సంఘాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో అండగా నిలిచారు. మాది రమ్య డ్వాక్రా సంఘం. మా సంఘంలో ఒక్కొక్క సభ్యురాలికి వైఎస్సార్ ఆసరా ద్వారా నాలుగు విడతల్లో రూ.40 వేల రుణమాఫీ జరిగింది. ఎవరి ప్రమేయం లేకుండా, ఎటువంటి రాజకీయ సిఫార్సు లేకుండా వైఎస్సార్ ఆసరా సొమ్మును బ్యాంకు ఖాతాలో జమ చేశారు. ఈ విధంగా చేయడం చాలా ఆనందంగా ఉంది.

– అప్పన అమ్మాజీ, మామిడికుదురు

చాలా ఆనందంగా ఉంది



వైఎస్సార్ ఆసరా ద్వారా మా సంఘంలో మొత్తం పది మంది సభ్యులకు రూ.5,83,240 ఆర్థికసాయం అందింది. ఒక్కొక్క సభ్యురాలికి ఏడాదికి రూ.14,581 వంతున, నాలుగేళ్లకు మొత్తం రూ.58,324 ఆర్థికసాయం అందించారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఈ విధంగా డ్వాక్రా సంఘాలకు సాయం అందించిన దాఖలాలు లేవు. డ్వాక్రా సంఘాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో అండగా నిలిచారు. ఆయనకు రుణపడి ఉంటాం.

– దండు పద్మావతి, మొగలికుదురు

సీఎంఆర్‌ఎఫ్‌తో ఎంతో మందికి లబ్ధి



మృతుడు జగపతిరావు కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల చెక్కు ఇస్తున్న ఎమ్మెల్యే రాపాక

సఖినేటిపల్లి: సీఎంఆర్‌ఎఫ్ నుంచి రాష్ట్రంలో ఎంతో మందికి లబ్ధి చేకూరుతోందని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శనివారం అంతర్వేదికరలో వైఎస్సార్ సీపీ గృహసారథి మేడిద జగపతిరావు, మరో గృహసారథి పోతురాజు భగవన్నారాయణ వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందారు.

దీంతో వీరి కుటుంబాలకు ఎమ్మెల్యే రాపాక చొరవతో సీఎం సహాయ నిధి నుంచి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం మంజూరైంది. ఈ మేరకు గ్రామంలో మృతుల ఇళ్లకు ఎమ్మెల్యే వెళ్లి, పై మొత్తాలకు సంబంధించిన నగదు చెక్కులను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అందించాలి

మామిడికుదురు: దేశ జనాభాలో 65 శాతం జనాభా ఉన్న బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అందించాలని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు డిమాండ్ చేశారు. మండల బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం సమావేశం మామిడికుదురు బీసీ కమ్యూనిటీ హాల్‌లో శనివారం జరిగింది. సంఘం మండల శాఖ అధ్యక్షుడు నైనాల రఘురామ్ అధ్యక్షన జరిగిన సభలో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు మాట్లాడుతూ మన రాష్ట్రంలో కుల గణన చేపట్టడం హర్షణీయమన్నారు. ఎంతో కాలం నుంచి ఎదురు చూస్తున్న కులగణన ఇంత కాలానికి కార్యరూపం దాల్చడం ఆనందంగా ఉందన్నారు. బీసీలు అంతా సంఘటితమై రాజ్యాధికారం వైపు పయనించాలన్నారు. 2022–23లో పదో తరగతి, ఇంటర్‌లో ప్రతిభ చూపిన బీసీ విద్యార్థులు 15 మందికి రూ.30 వేల ఆర్థిక సహాయం అందించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గుబ్బల మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి కర్రి సుబ్బరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ బొక్కా వెంకటేశ్వరరావు, మండల ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు భూపతి మనోహర్‌రాజు, రాయుడు నాగేశ్వరరావు, మండల శాఖ ప్రధాన కార్యదర్శి రాయుడు శ్రీనువాస్, రాజోలు, మలికిపురం, పి.గన్నవరం మండలాలకు చెందిన బీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.



విద్యార్థినికి నగదు ప్రోత్సాహం అందిస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

ఏకపక్ష నిర్ణయాలు చెల్లవు

జిల్లా పంచాయతీ అధికారి కృష్ణకుమారి

ఆత్రేయపురం: గ్రామ పంచాయతీలో ఏ పనులు చేపట్టాలన్నా కమిటీ సమావేశంలో అందరి అభిప్రాయాలను తీసుకుని మెజార్టీ సభ్యుల ఆమోదం మేరకు నిబంధనలు పాటిస్తూ తీర్మానాలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) కృష్ణకుమారి తెలిపారు. ఆమె పంచాయతీ వార్డు సభ్యుల అభ్యర్థన మేరకు శనివారం పంచాయతీలో సర్పంచ్ గెద్దం సుధ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని విలేకరులతో మాట్లాడారు. గ్రామంలో అభివృద్ధి పనుల నిమిత్తం కమిటీని ఏర్పాటు చేసినప్పుడు ఏడుగురు సభ్యులు ఉండాలని, ఈ కమిటీని వార్డు సభ్యులంతా కలిసి నియమించుకోవాలన్నారు. వార్డు సభ్యుల ఆమోదం లేకుండా చేసిన తీర్మానాలపై తాము సమగ్ర నివేదిక తయారు చేసి కలెక్టర్‌కు అందజేస్తామని డీపీఓ అన్నారు. తాము సర్పంచ్‌కు ముందుగా చెప్పి అనుమతి తీసుకుని తనిఖీలకు రావాల్సిన అవసరం లేదని, తాము ప్రభుత్వ అధికారులమని డీపీఓ ఈ సందర్భం స్పష్టం చేశారు. ప్రతి పనిని ప్రణాళికాబద్ధంగా నిబంధనలకు లోబడి చేపట్టాలని, అంతేగాని సర్పంచ్ ఇష్టానుసారం చేస్తుంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. తమకు ఉన్న ప్రభుత్వ ఉత్తర్వులు, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పనిచేస్తామని, నిబంధనలు పాటించకుండా పనులు చేపడితే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దళితురాలిననే వేధిస్తున్నారు

పంచాయతీలో కమిటీ ఆమోదం లేకుండా సర్పంచ్ ఏకపక్ష నిర్ణయాలతో వ్యవహరిస్తున్నారని వార్డు సభ్యుల అభ్యర్థన మేరకు శనివారం నిర్వహించిన అభ్యర్థన సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి కృష్ణకుమారి పాల్గొన్నారు. దీనిపై సర్పంచ్ గెద్దం సుధ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తమకు తెలియకుండా ముందస్తు సమాచారం లేకుండా అధికారులు పంచాయతీలకు ఎలా వస్తారంటూ నిలదీశారు. దళితురాలిననే అధికారులు అధికార పార్టీతో కలసి తనను వేధింపులకు గురి చేస్తున్నారంటూ సర్పంచ్ గెద్దం సుధ మళ్లీ తెరపైకి తెచ్చారు. దీనిపై అక్కడే ఉన్న మరో దళిత వార్డు సభ్యుడు మాట్లాడుతూ ప్రతిసారి దళిత సర్పంచ్ అంటూ కులం కార్డును వాడటం సరికాదని, తాను కూడా దళితుడినేనని, నిబంధనలు పాటించకపోతే ప్రభుత్వం దృష్టిలో ఎవరైనా ఒకటేనని సర్పంచ్ వ్యాఖ్యలను ఖండించారు. సర్పంచ్ మాట్లాడుతూ తాము ప్రజల ద్వారా ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధులమని, అధికారులు బెదిరిస్తే భయపడే ప్రసక్తే లేదని సర్పంచ్ బదులిచ్చారు. సమావేశంలో ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, కార్యదర్శి కృష్ణ, ఎంపీటీసీ సరెళ్ల ధనలక్ష్మి, ఉప సర్పంచ్ ముదునూరి విష్ణుమూర్తిరాజు, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆత్రేయపురంలో అభ్యర్థన సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభహారతి ఇచ్చారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు.

అలమూరులో..

అలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వేంచేసియున్న శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాలు శనివారం భక్తులతో కిటకిటలాడాయి. ఆయా దేవాలయాల ఆలయ పురోహితుల వేద మంత్రోచ్చారణ నడుమ భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆయా ఆలయాల్లో దేవతామూర్తుల విగ్రహాలను పూల, తులసి మాలలతో అలంకరించిన తీరు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.



నర్శిపూడిలో తులసిమాలలతో అలంకార భూషితుడైన వేంకటేశ్వరస్వామి

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు



నియోజకవర్గ స్థాయి క్రికెట్‌లో విజేతగా నిలిచిన లూటుకుర్రు జట్టు



మలికిపురంలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే తనయుడు వెంకట్రామ్

మలికిపురం: స్థానిక ఏఎఫ్‌డీటీ విద్యా సంస్థల ప్రాంగణంలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు మూడో రోజైన శనివారం ఉత్సాహంగా సాగాయి. శనివారం జరిగిన బ్యాడ్మింటన్ పోటీల్లో విన్నర్స్ హరికృష్ణ–రవి జోడి నిలవగా.. రన్నర్‌గా రాజోలు టీమ్, మూడో స్థానంలో నాగేశ్వరరావు టీమ్ నిలిచింది. ఈ సందర్భంగా క్రీడాకారులను ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు తనయుడు రాపాక వెంకట్రామ్ పరిచయం చేసుకుని మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలల్లో క్రీడలను ప్రోత్సహించడమే లక్ష్యంగా సీఎం జగన్ ఆడుదాం ఆంధ్ర క్రీడల నిర్వహణ చేస్తున్నారని అన్నారు. నల్లి శివకుమార్, కోళ్ల వేణుప్రసాద్, కార్యదర్శి బొంతు శ్రీహరి, పీఈటీలు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల్లో విజేతగా లూటుకుర్రు

మామిడికుదురు: పి.గన్నవరం నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్ర క్రికెట్ పోటీలో లూటుకుర్రు గ్రామానికి చెందిన జట్టు విజేతగా నిలిచింది. అంబాజీపేటలో శనివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో పి.గన్నవరం జట్టుపై లూటుకుర్రు జట్టు విజయం సాధించి విజేతగా నిలిచిందని, తద్వారా త్వరలో జరిగే జిల్లా స్థాయి ఆడుదాం ఆంధ్ర పోటీలకు ఎంపికైందని మండల కోఆర్డినేటర్ మట్టా శ్రీధర్ తెలిపారు. విజేతగా నిలిచిన జట్టు సభ్యులను జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు, పంచాయతీ కార్యదర్శి డి.సురేష్, పీడీలు బళ్ల శ్రీనివాస్, ఎం.శ్రీనివాసరావు, ఎం.రవిభూషణ్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, స్థానికులు అభినందించారు.

తహసీల్దార్ కార్యాలయ భవనం ప్రారంభం

రాజోలు: నూతనంగా నిర్మించిన రాజోలు తహసీల్దార్ కార్యాలయ నూతన భవనాన్ని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా శనివారం ప్రారంభించారు. భవనం ప్రారంభోత్సవానికి విచ్చేసిన కలెక్టర్ శుక్లాకు వేదపండితులు మంత్రోచ్చారణలు, మేళతాళాలతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు తహసీల్దార్ భవనాన్ని ప్రారంభించగా రెవెన్యూ, ఎన్నికల విభాగాల గదులను ఆర్డీవో ప్రారంభించారు. తహసీల్దార్ కార్యాలయానికి రహదారి, డ్రైనేజీ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు కోరారు. అన్ని సౌకర్యాలతో నూతన తహసీల్దార్ భవనం నిర్మాణం చేయడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. సర్పంచ్‌లు రేవు జ్యోతి, నక్కా రామారావు, జెడ్పీటీసీ మట్టా శైలజ, మాజీ ఏఎంసీ చైర్మన్ గెద్దాడ సత్యనారాయణ, నాయకులు కంచర్ల శేఖర్, తెన్నేటి కిషోర్, మట్టా ఏడుకొండలు, దార్ల పెదబాబు, బండారు కాశీ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే రాపాక, జిల్లా కలెక్టర్ శుక్లా

నేడు పి.గన్నవరానికి కేంద్ర సహాయమంత్రి రాక

పి.గన్నవరం: కేంద్ర సామాజిక, న్యాయ సహాయ మంత్రి అబ్బయ్య నారాయణస్వామి ఆదివారం పి.గన్నవరంలో పర్యటించనున్నారు. 'మాదిగలకు రాజకీయ భవిష్యత్' కోసం స్థానిక కోకోనట్ అసోసియేషన్ కల్యాణ మండపం వద్ద మధ్యాహ్నం 2 గంటలకు మహాసభ నిర్వహిస్తున్నారు. ఈ సభలో కేంద్ర సహాయ మంత్రి నారాయణ స్వామి పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. రెండు జిల్లాల సరిహద్దులో ఉన్న లంక గ్రామాలకు వెళ్లేందుకు వీలుగా వశిష్ఠ నదిపై యర్రంశెట్టివారిపాలెం సమీపాన వంతెన నిర్మించాలని కోరుతూ ఆయా లంక గ్రామాల ప్రజలు మంత్రికి వినతిపత్రం సమర్పించనున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి పర్యటించే ప్రాంతాలను శనివారం కొత్తపేట ఆర్డీఓ ఎం.ముక్కంటి, పి.గన్నవరం తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్‌లు పరిశీలించారు.



కేంద్ర మంత్రి పర్యటన నేపథ్యంలో వైపీపాలెం వంతెన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కొత్తపేట ఆర్డీఓ ముక్కంటి

సంక్షేమ పథకాలు పునరుద్ధరించాలంటూ ర్యాలీ

మామిడికుదురు: రద్దు చేసిన సంక్షేమ పథకాలు పునరుద్ధరించాలని కోరుతూ శ్రీనవదుర్గా ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం మోటార్ సైకిల్ ర్యాలీ జరిగింది. రాజోలులో ప్రారంభమైన ర్యాలీ నగరం మీదుగా మామిడికుదురు చేరుకుంది. మండల రెవెన్యూ కార్యాలయంలో యూనియన్ ప్రతినిధులు వినతిపత్రం ఇచ్చారు. జనవరి 27వ తేదీన థామస్ అల్వా ఎడిసన్ పుట్టిన రోజును ఎలక్ట్రీషియన్ డేగా ప్రకటించాలని, ఎలక్ట్రీషియన్ పనులు చేసే వారికి వృత్తి నిమిత్తం ఆర్థిక సహాయం అందించాలని ప్రతినిధులు కోరారు. సంఘం అధ్యక్షులు మెడబల రామారావు, ప్రధాన కార్యదర్శి బత్తుల జనార్దనరావు, ట్రెజరర్ మామిడిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

మాన్విత మధుమయికి కలెక్టర్ సత్కారం

అమలాపురం రూరల్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈదరపల్లి కలెక్టర్ బంగ్లాలో నిర్వహించిన ఎట్ హోం కార్యక్రమంలో సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా మాన్విత మధుమయి తన వేణుగానంతో అలరించారు. వేణు గానంలో అత్యుత్తమ ప్రతిభను మెచ్చి జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆమెను మెమెంటో, శాలువతో సత్కరించారు.

యోగాశ్రమం సభ్యుల రక్తదానం



రక్తదానం చేస్తున్న యోగాశ్రమం సభ్యులు

రావులపాలెం: స్థానిక స్వామి వివేకానంద యోగాశ్రమం సభ్యులు శనివారం రక్తదానం చేసినట్టు యోగా గురువు శ్రీనివాస్ తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి నిత్యం రక్తదానం చేస్తూ ఎంతోమంది ప్రాణాలు కాపాడుతున్నామన్నారు. ఇందులో భాగంగా అమలాపురం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారి కోసం, రక్తహీనతతో బాధపడుతున్న వారికోసం, గర్భిణులకు సర్జరీ నిమిత్తం ఏరియా ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్‌లో 12 మంది తమ యోగా ఆశ్రమం సభ్యులు రక్తదానం చేశారన్నారు.

నిరవధిక దీక్ష విరమణ

ఆలమూరు: మండలంలోని జొన్నాడలో వేంచేసిన ఉమా మల్లేశ్వరస్వామి (శివాలయం)లో అమ్మవారి పేరు మార్పును నిరసిస్తూ ఆ గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు ద్విభాష్యం శ్రీనివాసు చేపట్టిన ఆమరణ దీక్ష శనివారం విరమించారు. శివాలయంలో ఉమా అమ్మవారిగా మంత్రోచ్చారణ చేయాల్సిన పూజారులు పార్వతిగా సంబోధిస్తూ ఆలయ నిర్మాణదాతలు, భక్తులను తీవ్రంగా అవమాన పరుస్తున్నారని నిర్వహిస్తున్న ఈ దీక్షపై గ్రామ పెద్దలు స్పందించి సమస్యను పరిష్కరించేందుకు హామీ ఇచ్చారు. ఆలయం ఆవరణలో ఉమా మల్లేశ్వరస్వామి ఆలయంగా బోర్డు పెట్టి ఆ మేరకు పూజలు నిర్వహిస్తామని గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ద్వారంపూడి నాగేంద్ర సత్యనారాయణ రెడ్డి, దేవరకొండ సూరిబాబు, చెరుకూరి శ్రీహరి, జనార్దన్, తమలంపూడి ఈశ్వరరెడ్డి హామీ ఇచ్చారు. దీంతో రిటైర్డ్ ఉపాధ్యాయుడు శ్రీనివాసుకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు.